సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆదర్శనగర్ సాయిబాబా ఆలయంలో యాగం చేస్తున్న మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం కుంకుమ పూజలు చేశారు. దసరా ఉత్సవాలు సందర్భంగా ఇక్కడి అమ్మవారి విగ్రహం వద్ద హోమం నిర్వహించారు. అనంతరం అర్చకులు మహిళలతో కుంకుమ పూజలు చేయించారు.

యువ మోర్చా ఉపాధ్యక్షుడికి అభినందనలు



మాధవరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎంవీపీ కాలనీ: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావుకు పలు విద్యార్థి సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్యార్థి సంఘాల ప్రతినిధులు దంతేశ్వర్‌పట్నాయక్, జగదీశ్, కిరణ్, రాజు, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పిఠాపురం కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 100 రకాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవ సమితి సభ్యుడు రావణ అక్షయ మాట్లాడుతూ దసరా అంటే పదింటిని నాశనం చేసేదని అర్థమన్నారు.

రవీంద్రకుమార్‌కు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి హరిదాసు రవీంద్రకుమార్‌కు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు కె.సీతామాణిక్యం పర్యవేక్షణలో రోల్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇన్ క్రిమినల్ జస్టిస్ సిస్టం-ఏ క్రిటికల్ లీగల్ స్టడీ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను రవీంద్రకుమార్ స్వీకరించారు. రవీంద్రను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

పోలియో రహిత సమాజమే రోటరీ ధ్యేయం

బీచ్‌రోడ్డు: పోలియో రహిత సమాజమే రోటరీ ధ్యేయమని ఆ క్లబ్ పోలియో విభాగం చైర్మన్ శోభన్‌ప్రకాష్ అన్నారు. అంతర్జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలియో ముగింపు పేరుతో ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం పోలియోపై అవగాహన కల్పిస్తూ బాలికలు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. రోటరీ క్లబ్ పూర్వ గవర్నలు కిశోర్ కుమార్, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సాధు శతకం' పుస్తకావిష్కరణ

సీతంపేట: పి.ఎల్.వి.ప్రసాద్ రచించిన 'సాధు శతకం' పుస్తకావిష్కరణ సభ అమరావతి విశ్వ సాహితి ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. ప్రముఖ పద్య కవి సిహెచ్.చినసూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూలికుప్పల మాట్లాడుతూ సరళంగా ప్రసాద్ రాసిన రచనా శైలిని అభినందించారు.



విజయదుర్గాదేవి నమోస్తుతే



చండీయాగం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



విజయదుర్గాదేవి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఏయూ క్యాంపస్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాష్టమిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెదవాల్తేరు పోలమాంబ ఆలయంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన, తులసి పూజలు నిర్వహించారు. పోలమాంబ.. దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

విజయదుర్గగా లలితాదేవి

ఏయూ అవుట్ గేట్ వద్ద ఉన్న శ్రీలలితా సుందరేశ్వర పీఠంలో లలితా త్రిపుర సుందరి దేవి శ్రీవిజయదుర్గ అలంకరణలో కనువిందు చేశారు. ఉదయం పంచామృత అభిషేకం, సహస్రకుంకుమార్చనతో దుర్గాష్టమి వేడుకలు ప్రారంభించారు. అనంతరం దుర్గాష్టమి ప్రత్యేకార్చన, చండీ హోమం, సాయంత్రం శ్రీవిజయదుర్గాదేవి ఆవరణార్చనతో శ్రీచక్రార్చన జరిపారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. పెదవాల్తేరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈస్ట్ షిర్డీ ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

18వ వార్డులో మహా చండీయాగం

ఎంవీపీ కాలనీ: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 18వ వార్డు ఎంవీపీ సెక్టార్-9లో మహా చండీయాగం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు బాబీరెడ్డి, 18వ వార్డు నాయకులు పుక్కళ్ల ధనలక్ష్మి, పుక్కళ్ల శంకర్, వార్డు అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవికి దీపారాధన

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు హనుమంతవాక దరి విజయదుర్గాకాలనీ విజయదుర్గాదేవి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి అమ్మవారి ప్రాంగణంలో దీపారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారి చిత్రపటం వేసి భక్తులు దాని చుట్టూ దీపాలు వెలిగించారు. ఈ దీప కాంతుల మధ్య అమ్మవారికి పూజలు చేశారు.

ఘనంగా దుర్గాదేవి సారె ఊరేగింపు

మద్దిలపాలెం : పిఠాపురం కాలనీలో కనకదుర్గ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గాదేవి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. మేళ తాళాలు, వేద మంత్రాలు, కోలాట నృత్యం నడుమ అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారి సారెను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చందక సురేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విజయదుర్గగా లలితా త్రిపుర సుందరి దేవి దర్శనం



కుంకుమ, తులసి పూజలో పాల్గొన్న భక్తులు



పిఠాపురం కాలనీలో దుర్గాదేవి సారె ఊరేగింపు

దుర్గమ్మ సన్నిధిలో అన్నసంతర్పణలు



న్యూశాంతినగర్‌లో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి



ఈశ్వరినగర్‌లో అన్నసంతర్పనలో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న స్వామీ



చైతన్యనగర్‌లో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ 23వ వార్డు ఇన్‌చార్జి సత్యారెడ్డి



దుర్గానగర్‌లో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ 15వ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు

ఆరిలోవ: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరిలోవలో ఆదివారం పలుచోట్ల అన్నసమారాధనలు జరిగాయి. జీవీఎంసీ 10వ వార్డులో జరిగిన అన్నసమారాధనలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు పాల్గొని వడ్డించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. జీవీఎంసీ 12వ వార్డు ఈశ్వరినగర్‌లో గురు భవాని అభిరామ్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం చైతన్యనగర్‌లో వినాయక గుడి వద్ద దుర్గా భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి హాజరై భక్తులకు ప్రసాదం వడ్డించారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ 15వ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు హాజరై భక్తులకు ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అవతారం, నరాల ప్రసాద్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



పీతవానిపాలెంలో బొమ్మల కొలువు



ఎంవీపీ కాలనీలో సకల దేవతలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీకి చెందిన నండూరి వెంకట నరసింహం, లావణ్య దంపతుల ఇంట్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. సకల దేవతా మూర్తులు ఒకే చోట దర్శనమివ్వడంతో స్థానికులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. దశావతారాలు, అష్టలక్ష్మి రూపాలు, పూరీజగన్నాథ్ ప్రతిమలు, శ్రీవేంకటేశ్వరస్వామి రూపాలతో పాటు పలువురు ప్రసిద్ధ దేవతామూర్తుల ప్రతిమలు ఏర్పాటు చేశారు. దసరా, సంక్రాంతి సమయంలో ఆడ పిల్లలు ఉన్న ఇళ్లలో బొమ్మకొలువు ఏర్పాటు చేయడం తెలుగు వారి సంప్రదాయమని, ఇందులో భాగంగానే ఈ కొలువు ఏర్పాటు చేశామని నండూరి దంపతులు తెలిపారు.

మద్దిలపాలెం : పీతవానిపాలెంలోని టీఎస్సార్ అపార్ట్‌మెంట్‌లో బొమ్మల కొలువు ఏర్పాటుచేశారు. దేవతామూర్తుల ప్రతిమలు ఏర్పాటు చేసి, దసరా పండగ ఔన్నత్యాన్ని వివరించారు.

తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ ఎటువంటి నేరాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసు నిఘా ఉంటుందన్నారు. పలు హత్య కేసుల్లో ఉన్న నిందితులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వేలి ముద్రలు సేకరించారు.



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయకుమార్

- ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లకు పాల్పడవద్దని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద అప్పగించారు.

'ధూమపానం హీరోయిజం కాదు'



మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

బీచ్ రోడ్డు: జీవితాలను అనారోగ్యం పాలుచేసే ధూమపానాన్ని హీరోయిజంగా సినిమాల్లో చూపించడం తగదని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆదివారం దూమపానంపై వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో వైఎంసీఏ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ పొగ తాగడంపై ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ధూమపానం మానేసిన పలువురిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు నవీన్ ప్రకాశ్‌శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు, పాల్గొన్నారు.



















